


వివరాలు మెయిన్‌లో

## తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ సమస్యలు పరిష్కరించాలి


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
### నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 13 నవంబరు , 2026 | పేజీలు : 7


## కోదాడ నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తాం
### ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ పథకాల అమలుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కోదాడ మున్సిపాలిటి పరిధిలో 24వ వార్డులో ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కోదాడ నియోజకవర్గానికి 5500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసి వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. నిర్మాణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర సమస్యలను తమ దృష్టికి తీసుకవస్తే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, కౌన్సిలర్ శివ, కందుల కోటేశ్వరరావు, అంబటికర్ర శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే**

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** కూచిపూడి తండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కూచిపూడి తండలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ మహిళా సంఘం భవనాన్ని స్థానిక సర్పంచ్ హాజీనాయక్ స్థానిక నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసి వారి ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి కార్యకలాపాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 2028 జూన్ నాటికి దేవరకొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా
### ఎంఎల్ఏ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ;** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సాధ్యమని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మార్కెట్ యార్డులో నియోజకవర్గానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు. 209 మంది లబ్ధిదారులకు రూ. 84లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, 130 మంది లబ్ధిదారులకు రూ. 1.30కోట్ల విలువైల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణి చేశారు. మొత్తం 339 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 2.14కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించారు. 2028 జూన్ నాటికి దేవరకొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యం అని ఎంఎల్ఏ బాలునాయక్ స్పష్టం చేశారు. 2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బిసితో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టుల ద్వారా దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సాగునీరు అందించి, మిర్యాలగూడ లేదా నాగార్జునసాగర్ ప్రాంతాల్లో ఉన్నట్లుగా పచ్చని పంటలతో నియోజవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, నాయకులు వెంకటేష్‌గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ పట్టణ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




# అడుగంటుతున్న జలాలు..అద్దె బోర్లతోనే ఆసరా!

### ఎండాకాలం రాకముందే గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం
### నెలకు రూ.10 వేలు చెల్లించి రెండు ప్రైవేట్ బోర్ల అద్దె
### చందుపట్లలో ముందస్తు చర్యలు చేపట్టిన గ్రామపంచాయతీ పాలకవర్గం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** వేసవి కాలం రాకముందే గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో అప్పుడే నీటి కష్టాలు మొదలయ్యాయి.నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో సుమారు 5 వేల జనాభా,వెయ్యికి పైగా నివాసాలు 12 వార్డులు ఉన్నాయి. గ్రామంలో మొత్తం 15 బోర్లు ఉండగా,నీటిమట్టం పడిపోవడంతో ఇప్పటికే 3 బోర్లు పూర్తిగా ఎండిపోయాయి.మిషన్ భగీరథ జలాలు వస్తున్నా.. పూర్తిస్థాయిలో పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో అన్ని ప్రాంతాలకు నీరు అందడం లేదు.

**ఎత్తయిన వార్డులకు నీటి గండం**

గ్రామంలోని 6,7,9వార్డులు ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.దీనికి తోడు లోవోల్టేజీ,తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండటంతో మోటార్లు సరిగ్గా నడవడం లేదు.గతంలో నెల రోజులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసిన అనుభవం దృష్ట్యా.. పంచాయతీ పాలకవర్గం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది.నెలకు రూ.10 వేల చొప్పున రెండు ప్రైవేటు బోర్లను అద్దెకు తీసుకుని,వాటిని ప్రధాన పైప్‌లైన్‌కు అనుసంధానం చేసి ఆ మూడు వార్డులకు నీటిని అందిస్తున్నారు. గ్రామ చెరువులోనూ నీరు లేకపోవడంతో బోర్లు రీఛార్జ్ కావడం లేదు.మరో రెండు వారాల్లో చెరువుకు నీరు వచ్చే అవకాశం ఉండటంతో పరిస్థితి కొంత మెరుగుపడుతుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయే వేసవిలో ఏంటనే ఆందోళన వ్యక్తమవుతోంది.



**నీటిని పొదుపుగా వాడుకోవాలి: దిగోజు లతా వెంకటాచారి,సర్పంచ్**

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి. నల్లాలు లీకవుతుంటే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులతో కలిసి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం.





## ఉపాధి హామీ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/రామన్నపేట:** పట్టణ కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో ఆవుల రాములు గురువారం పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించడంతో పాటు, కూలీలకు అందుతున్న సౌకర్యాలు, పనుల పురోగతిపై పలు కీలక సూచనలు చేశారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, నాణ్యతతో కూడినవిగా జరిగేలా చూడాలని ఆదేశించారు. పనులకు వస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రథమ చికిత్స వసతులు కల్పించాలని ఫీల్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధి పనులకు సంబంధించిన మస్టర్లు, రికార్డులు ఎప్పటికప్పుడు సరిగ్గా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి సైదిరెడ్డికి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రఫీ, వెంకన్న, పంచాయతీ కార్యదర్శి సైదిరెడ్డి, కారోబార్ ప్రవీణ్, ఎంపీఓ, ఫీల్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీవో శేషగిరి శర్మ సూచించారు. గురువారం మిర్యాలగూడ మండల పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామంలో విబిజి రాంజీ పథకం ద్వారా చెరువులో చేపడుతున్న పూడికతీత పనులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమై జలసిరి పనుల ప్రాముఖ్యతను, నీటి సంరక్షణ ఆవశ్యకతను కూలంకషంగా తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో భూగర్భంలో నీటిమట్టం రోజురోజుకు అడుగంటిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పాఠశాల ఆవరణలో ఓహెచ్ఎస్ఆర్ నీటి ట్యాంక్ దగ్గర కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మాణ పనులకు మార్కౌట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాసిం, ఈసీ కళావతి, టెక్నికల్ అసిస్టెంట్ రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, మేట్లు, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తోమాల, తులాభార సేవల పునరుద్ధరణ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని దేవస్థానం పాలకవర్గం గురువారం కొన్ని కీలక నిర్ణయం తీసుకుంది. స్వామివారి సన్నిధిలో తోమాల సేవతో పాటు తులాభార సేవను కూడా పునరుద్ధరిస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. తోమాల సేవ టికెట్ ధర: రూ. 1,250/ దంపతులకు మాత్రమే ఈ సేవలో పాల్గొనే అవకాశం ఉంటుంది. భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ వస్త్రధారణలో మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. అనంతరం ఒక కళ్యాణం శాలువా, ఒక కండువాతో పాటు స్వామి వారి అభిషేక లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తారు.

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మిర్యాలగూడ విద్యార్థులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మిర్యాలగూడ పట్టణంలోని ఏఎస్ఆర్ ద్రోణ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక య్యారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ నెల 11న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నల్లగొండ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 బాలబాలికల విభాగంలో జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మిర్యాలగూడలోని ఏఎస్ఆర్ ద్రోణ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు.మైనస్ 57 కేజీల విభాగంలో సిహెచ్ కార్తిక రెడ్డి, ప్లస్ 57 కేజీల విభాగంలో జి శృతి బంగారు పతకాలు కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జూడో వైస్ ప్రెసిడెంట్, జూడో కోచ్ కే శ్రీధర్, మిర్యాలగూడ డివిజన్ జూడో వైస్ ప్రెసిడెంట్ పి అంజి, ఏఎస్ఆర్ ద్రోణ పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహారావు, డైరెక్టర్ అనిల్, శ్రీలత పాల్గొన్నారు.

## పాఠశాలల నిలువు దోపిడీ అరికట్టాలి





**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పదో తరగతి పరీక్ష ఫీజుల పేరుతో ప్రైవేట్ పాఠశాలల నిలువు దోపిడిని అధికారులు వెంటనే అరికట్టాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సైతం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యాపారంగా మార్చుకొని విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం పదో తరగతి వార్షిక పరీక్షల రుసుమును కేవలం రూ.125గా నిర్ణయిస్తే కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం పరీక్ష ఫీజు పేరుతో రూ. 1000కి పైగా, మరికొన్ని పాఠశాలల్లో రూ.2 నుండి 4వేల వరకు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆన్‌లైన్ ఖర్చులు, ఇతర నిర్వహణ ఖర్చుల పేరుతో విద్యార్థుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేయడం ఏ నిబంధనల ప్రకారం చేస్తున్నారో విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు లెనిన్, వంశీ, ప్రవీణ్, వినయ్, మహేష్, నవీన్, భార్గవ్, సాయి, రాజు, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని ఇబ్బందులు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనాజీపూర్, నందనం, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, రాష్ట్ర సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డిలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి 20 రోజుల క్రితమే మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. సరైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, చేతికొచ్చిన కొద్దిపాటి పంటనైనా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు రూ.1,800 నుంచి రూ.1,900కే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గోద శ్రీనివాస్ గౌడ్, మదర్ డైరక్టర్ కస్తూరి పాండు, నందనం సర్పంచ్ నాగేల్లి గిరిజ రమేష్ గౌడ్, బీఆర్ఎస్ యువ నాయకులు మట్ట దానంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ రాసాల మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

## సైట్ డెవలప్‌మెంట్ పూర్తి చేసి కస్టమర్లకు న్యాయం చేస్తాం



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** త్వరలో సైట్ డెవలప్‌మెంట్ పూర్తి చేసి కస్టమర్లకు ప్లాట్లు అందజేస్తామని శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ యజమాని కర్నాటి శ్రీదేవి గురువారం తెలిపారు. శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ అధినేత అయిన నా భర్త నారాయణరావు అనారోగ్యంతో మరణించడం వలన లే అవుట్ అభివృద్ధి చేయడంలో కొంత జాప్యం జరిగిన విషయం వాస్తవమేనని ఆమె అన్నారు. అతి త్వరలో ప్లాట్స్ డెవలప్మెంట్ పూర్తి చేసి కస్టమర్స్ కు అందిస్తామని శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ పార్ట్నర్స్ కర్నాటి శ్రీదేవి తెలిపారు. శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ అధినేత అయిన నా భర్త నారాయణరావు గతంలో రాజాపేట మండలం చల్లూరు గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 322లో, తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామ శివారులోని కొంత భూమి దారి కోసం మొత్తం 70.09 ఎకరాల భూమిని కొనుగోలు చేసి దానిలో 65.09 ఎకరాల భూమిలో 762 ప్లాట్స్ మ్యాపింగ్ చేసి మిగతా 5 ఎకరాల భూమిని దారి కోసం రాజాపేట మండలం చెల్లూరు గ్రామపంచాయతీ పేరున, తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామపంచాయతీ పేరున గిఫ్ట్ డిడి చేయించినట్లు తెలిపారు. లే అవుట్ ని డెవలప్మెంట్ చేసి అతి త్వరలో కస్టమర్లకు అందజేస్తామని ఎవరు కూడా అధైర్యపడవద్దని ఆమె విన్నపం చేశారు. జాప్యం జరిగిన వాస్తవమేనని, అతి త్వరలో ప్లాట్స్ డెవలప్మెంట్ పూర్తి చేసి వారికి అందించి అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు.



## న్యాయస్థాన కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కృషి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** న్యాయవాదుల సహకారంతో న్యాయస్థాన కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కృషి చేస్తానని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ మునవార్ హుస్సేన్ అన్నారు. గురువారం తుంగతుర్తి కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు తుంగతుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి న్యాయవాదులు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయవ్యవస్థ గౌరవ ప్రతిష్టలను కాపాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో తమవంతు సహకారం అందించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపర్తి జ్ఞానసుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి. హరిచరణ్, మల్లెపాక రవి, జె. కుమారస్వామి, కె. వెంకటేశ్వర్లు, టి. సత్యనారాయణ, ఎస్‌కె వజీర్, బి. ప్రతాప్, వేణురాజ్ యాదవ్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూళ్లను నిలిపివేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థుల నుంచి అధిక ఫీజుల వసూళ్లను వెంటనే నిలిపివేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని సైనాప్స్ జూనియర్ కళాశాల ప్రధాన గేటు ఎదుట అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల నుంచి ప్రభుత్వ పరీక్ష ఫీజు కేవలం రూ.540 మాత్రమే ఉండగా, సైనాప్స్ జూనియర్ కళాశాల యాజమాన్యం ఒక్కో విద్యార్థి నుంచి రూ.2,200 చొప్పున అక్రమంగా వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చి పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, వరుణ్, బన్నీ పాల్గొన్నారు.

## క్షుద్ర పూజల కలకలం..



**ప్రజాపక్షం/మోటకొండూర్:** మోటకొండూర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం క్షుద్ర పూజలంటూ కనిపించిన వస్తువులు కలకలం రేపాయి. హనుమాన్ దేవాలయం సమీపంలోని ఓ ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బొమ్మతో పాటు నిమ్మకాయలు, కుంకుమ, పసుపు ఉంచడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఉదయం ఇంటి సమీపంలో ఈ వస్తువులను గమనించిన స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో ఈ విషయం మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న వస్తువులను పరిశీలించి, పంబాలవారిని పిలిపించి వారి ద్వారా వాటిని తొలగింపజేశారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ వస్తువులను అక్కడ ఉంచి వెళ్లి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు గ్రామపంచాయతీని, పోలీసులను కోరుతున్నారు.

**మోటకొండూరులో క్షుద్ర పూజల ప్రచారం కేవలం మూఢ నమ్మకమే: గుర్రాల నాగరాజు**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయం సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పసుపు బొమ్మ, కుంకుమ, పసుపు ఉంచి క్షుద్ర పూజల పేరుతో భయాందోళనలు సృష్టించడం అంత మూడనమ్మకమేనని మూడ నమ్మకాల నిర్మూలన సంఘం యూత్ కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుర్రాల నాగరాజు తీవ్రంగా ఖండించారు.



## చంద్రంకు పరామర్శ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణం లోని శ్రీహన్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి చంద్రంను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ అధికార ప్రతినిధి కందమల్ల శేఖర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, పెన్‌పహాడ్ మండల ఎస్ఎస్‌యుఐ అధ్యక్షులు పన్నాని సందీప్ వర్మ, నాయకులు పందిరి మల్లేష్, రాపర్తి నాగరాజు, నర్సయ్య, గోలి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి




**ప్రజాపక్షం/రామన్నపేట:** నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం రామన్నపేటలో భారీ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. అనంతరం రైతు సంఘం మండల నాయకత్వంతో కలిసి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్యలు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయిని ఆనంద్, గన్నెబోయిన విజయభాస్కర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి నగేష్ పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికే జాతీయ మహాసభలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతు సమస్యల పరిష్కారానికే ఏఐకేఎస్ జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దబ్బికార్ మల్లేష్ తెలిపారు. గురువారం నల్లగొండలో నిర్వహించనున్న జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రచార జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మహాసభల ఆవశ్యకత గురించి డివిజన్ వ్యాప్తంగా మూడు ప్రత్యేక ప్రచార జాతాలు విస్తృతంగా పర్యటిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, మల్లు గౌతమ్‌రెడ్డి, కోడిరెక్క మల్లయ్య, కేశవులు, రవి, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నవంబర్ 9వ తేదీన నిర్వహించే న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ప్రజలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో, మండల న్యాయ సేవాధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ప్రాంగణంలో బుధవారం న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.శిరీష ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామన్నపేట పాల్గొని ప్రజలకు న్యాయ సేవల ప్రాముఖ్యత, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం మరియు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే వివిధ సేవల గురించి వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్ న్యాయపరమైన అంశాలపై ప్రజలకు వివరించారు. అదేవిధంగా అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యులు కె. శ్రీశైలం, పారా లీగల్ వాలంటీర్ వై. యాదయ్య, గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.సైదిరెడ్డి, ఎంపీఓ ఎం.డి. రఫీ పాల్గొన్నారు.

# ముందస్తుగా ప్రణాళికలు తయారు చేసుకోవాలి




**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ముందుస్తుగా ప్రణాళికలు తయారు చేసుకొని కరువును ఎదురుకోవాలని దేవకొండ ఎంఎల్‌పి నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిపో కార్యాలయంలో నిర్వహించిన మండల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలలో త్రాగునీటి సమస్య రాకుండా అధికారులు చూడాలని అన్నారు. రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించి కరువు బారిన పడకుండా వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు చేయాలని అన్నారు. కృష్ణ జలాలను పొదుపుగా వాడుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. కరువు పరిస్థితులకు ఎప్పటికప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా త్వరలో మోటార్ వెహికిల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించనున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి ప్రజలను కరువు భారీన పడకుండా రక్షించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయేందర్‌రెడ్డి, తహశీల్దార్ నరేందర్, ఎంపిడిపో స్వర్ణలత, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చిల్లేపల్లి పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండలంలోని చిల్లేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సంఘ చైర్మన్‌గా కట్టా రామారావుతో పాటు 12 మంది పాలకవర్గ సభ్యులు కేతిరెడ్డి నర్సిరెడ్డి, రామకోటయ్య, అనంతుల రేణుక, గజగంటి ప్రవీణ్, కారింగుల సుజాత, దోరేపల్లి లింగమ్మ, మాలోతు సైదా, దిండిగాల కిరణ్, నన్నే పంగు ఏడుకొండలు, బండ్ల నాగేశ్వరరావు, పల్లె లింగయ్య లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ కట్టా రామారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన సేవలు, సదుపాయాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకట రెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, పిఎసిఎస్ సిఈవో నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతన పాలకవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# దళారులతో కుమ్మక్కై రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/కోదాడ:** దళారులతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై రాత్రికి రాత్రే ధాన్యం ధర తగ్గించి రైతులను దగా చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం కోదాడలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ రైతుల ఉసురు తీసుకుంటుందని, అస మర్థ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రలోకి ఎక్కుతారని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు నష్టపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, ఇప్పటివరకు సదరు మండలాల్లో నష్టపోయిన రైతులను గుర్తించకపోవడంతో పాటు ఒక పైసా కూడా చెల్లించలేదని, ఇది ప్రజా ప్రభుత్వం కాదాని ప్రజాప్రతికార ప్రభుత్వమని విమర్శించారు. ఓ పక్క కరువుతో అరకొర పండిన ధాన్యం కళ్లాల వద్దకు వచ్చి, అమ్ముకునే సమయానికి దళారులతో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం కుమ్మక్కై రేట్లను అమాంతం తగ్గించడం అత్యంత దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుల నర్సిరెడ్డి, సురేష్, బట్టు శివాజీ, కందిబండ సత్యనారాయణ, ఉపేందర్, రమేష్, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, నర్సింహారావు, కరీముల్లా బాబా, ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైన సర్పంచ్ చాట్ల చిరంజీవి



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామ పంచాయతీ సర్పంచ్ చాట్ల చిరంజీవి జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికయ్యారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, విద్యా, వైద్యం, గ్రామాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ బహుజన సాహిత్య అకాడమీ(బిఎస్ఏ) ఆధ్వర్యంలో ఈనెల 15న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న 20వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో 28 రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో సర్పంచ్ చాట్ల చిరంజీవి జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకోనున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ చాట్ల చిరంజీవి మాట్లాడుతూ తనకు ఈ అత్యున్నత పురస్కారం లభించడానికి గ్రామ ప్రజలే ప్రధాన కారణం అని,ఈ అవార్డు తన ఒక్కడికే దక్కిన గౌరవం కాదని, చిత్రియాల గ్రామ ప్రజలందరికి దక్కిన గౌరవం అని ఆయన పేర్కొన్నారు.

# అఖిల భారత కిసాన్ సభను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/రామన్నపేట:** అఖిల భారత రైతు సంఘం 36వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేసేందుకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రెడ్ షర్ట్ వాలంటీర్లు సిద్ధమవుతున్నారు. నవంబర్15 నుండి 18 వరకు నల్గొండ పట్టణంలో జరగనున్న జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా వేలాది మంది రైతు ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు శానగోండ రాము మెట్టు శ్రావణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్, ఆకిటి మల్లేష్, ఎర్ర భిక్షపతి, మచ్చ నరేష్, మేడి ముకుంద, అప్పం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/త్రిపురారం:**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం త్రిపురారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం గ్రామానికి చెందిన పర్వతం మహేష్ (24) తన ద్విచక్ర వాహనం పై నుంచి మిర్యాలగూడకు వెళ్తుండగా,మార్గమధ్యంలోని వెంకట సాయి రైస్ మిల్లు సమీపంలో అకస్మాత్తుగా గేదెలు రోడ్డుపైకి రావడంతో వాటిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో మహేష్ ముక్కు వద్ద తీవ్ర గాయమైంది.వెంటనే చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.మృతుడి అన్న పర్వతం శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐనరేష్ తెలిపారు.

# లీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

**ప్రజాపక్షం/త్రిపురారం:** భూముల రిసర్వే తో భూమి పట్టాదారులకు శాశ్వత భూ పరిష్కారం దొరుకుతుందని మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్ద దేవుల పల్లి గ్రామపంచాయతీ పరిధిలో నర్ల కంటి గూడెం గ్రామంలో భూముల రిసర్వే కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని ఏదైనా భూ సమస్యలు ఉన్నట్లయితే అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, తాసిల్దార్ ప్రమీల,ఆర్ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# సభకు రైతులు భారీగా తరలి రావాలి

**ప్రజాపక్షం/త్రిపురారం :** నల్లగొండలో ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలకు రైతులు భారీగా తరలిరావాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దైద శ్రీను పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గోగుల ఇద్దయ్య,రైతు సంఘం నాయకులు కొప్పువెంకన్న, నర్సిరెడ్డి, సైదులు, రఘురాం పాల్గొన్నారు.



## కరాటేలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** బాలికలు కరాటేలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పలువురు బాలికలు కరాటే పోటీల్లో బంగారు, వెండి, కంచు పథకాలను సాధించిన నేపథ్యంలో గురువారం ఆయన వారిని అభినందించారు. సర్టిఫికెట్లను అందజేసి కరాటేలో రాణించాలని కోరారు. నడిగూడెం గురుకుల బాలికలు చదువుతో పాటు క్రీడల్లో, కరాటే తదితర పోటీల్లో రాణిస్తూ రాష్ట్ర,జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి బంధుమిత్రులు సైబర్ నేరగాళ్ల పట్ల చాల జాగ్రత్తగా ఉండాలని హుజూర్‌నగర్ ఎస్ఐ హనుమాన్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని పెరల్ ఇన్ఫినిటి స్కూల్ లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. డ్రగ్స్ క్రయ విక్రయాలపై ఏదైన సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విజయ్, మహేష్, రవీందర్ పాల్గొన్నారు.

## అఖిలభారత రైతు మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వీర తెలంగాణ పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 36వ అఖిల భారత రైతు మహాసభలను జయప్రదం చేయాలని, ఈనెల 15వ తేదీ ఆదివారం జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు, రైతులు, ట్రేడ్ యూనియన్ నాయకులు కలిసికట్టుగా తరలిరావాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సిపిఎం కార్యాలయం ఆరిబండి భవన్‌లో రైతు మహాసభల గొడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కందగట్ల అనంతప్రకాశ్, కొదమగుండ్ల నగేష్, సిరికొండ శ్రీను, నీలా రామ్మూర్తి పాల్గొన్నారు.

## నోట్ బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో గురువారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్‌ను రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాములు, ఉషాల చేతుల మీదుగా పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజినికుమారి, రమేష్, ప్రమీల, నాంచారమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఒకేషనల్ విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలన



**ప్రజాపక్షం/నడిగూడెం:** ఇంటర్ వృత్తి విద్య కోర్సుల విద్యార్థులకు ఓజెటి నడిగూడెం కెవిఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఓజెటి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చదువుతున్న కోర్సులకు అనుబంధంగా ఉన్న రంగాల్లో స్వయం ఉపాధి కల్పన కోసం క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. కళాశాలలో ఉన్న సిపి, ఓఎ,పిఈటి, ఇటిఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యూ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం రెండు నెలల పాటు ఓజెటి కార్యక్రమం నిర్వహించాలి, దీనిలో భాగంగా నడిగూడెం కళాశాల విద్యార్థులు మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం పల్లె దవఖాన మోటర్ సర్వీసింగ్ సెంటర్‌లలో గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తరగతి గదుల్లో ఉన్న పాఠ్యాంశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా నైపుణ్యాన్ని నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, సిహెచ్ కృష్ణ, మహేష్, వీరన్న, మధార్, ధనుంజయ్, నగేష్, హేమమని, నాగరాజు, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేసుల సత్వర పరిష్కారానికి సహకరించండి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు తమవంతు కృషి చేయాలని న్యాయమూర్తులు షేక్ అయేషా సరీన్, మంచలా మమత లు విజ్ఞప్తి చేశారు. గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంచాల మమత లకు స్వాగత, సన్మాన కార్యక్రమం బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయస్థానాల పరిధిలో పెండింగ్ కేసుల భారం అధికంగా ఉందని, తద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో జాప్యం జరుగుతుందని, దానిని నివారించడానికి న్యాయవాదులు తమవంతుగా కృషి చేయాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధుల ఆర్‌వి రమణారెడ్డి, కాల్వ శ్రీనివాసరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కుక్కడపు బాలకృష్ణ, బొబ్బ కోటిరెడ్డి, ఎజిపిలు బాణోతు సురేష్, శ్రీనివాసుల రేణుకాదేవి, చల్లా కృష్ణయ్య, మాధవరెడ్డి, రాఘవ రావు, కుక్కడపు సైదులు, నగేష్ రాథోడ్, దూళిపాళ శ్రీనివాసరావు, సుంకరి ప్రదీప్తి, శృతి, ఐశ్వర్య, సంధ్య, సమీనా పాల్గొన్నారు.

## సమ్మెకు మద్ధతివ్వాలని ఆశాల వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని బేషరుతుగా అమలు చేయాలని కోరుతూ ఈనెల 15 నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మెకు మద్ధతు ఇవ్వాలని కోరుతూ ఆశా కార్యకర్తలు గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై మూడేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయిందని మండిపడ్డారు. ఆనాటి సిఎం కెసిఆర్ కంటికి రెప్పాలా కాపాడుకుంటే, నేటి సిఎం రేవంత్ రెడ్డి మాత్రం తమ చావు కోరుతున్నాడని ఆరోపించారు. జీతాలు సక్కగ ఇవ్వడం లేదు కానీ యాక్సిడెంట్ భీమా మాకెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు అయ్యేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వారి అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతోనే సంస్థలకు గుర్తింపు



**ప్రజాపక్షం/నకిరేకల్** :వస్తు,సేవల రంగంలో సంస్థలు నాణ్యత ప్రమాణాలతోనే గుర్తింపు పొందుతాయని,తాము అనుసరించే మెరుగైన విధానాలే నాణ్యత ప్రమాణాలకు ఆధారమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రధానాచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు. గురువారం కళాశాల కామర్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ నాణ్యతా దినోత్సవం కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఆయనమాట్లాడారు. ప్రస్తుతం సమాజం అన్ని రంగాల్లో నాణ్యత ప్రమాణాల కొరతను ఎదుర్కొంటోందని, మూడో ప్రపంచ దేశాలు విద్య,వైద్యం,ఉపాధి,ఉత్పాదక రంగాల్లో నాణ్యత ప్రమాణాల సమస్యను ఎదుర్కొంటూ ఆర్థికాభివృద్ధి సూచీలో దిగువన ఉన్నాయని,ఇందుకు విద్యలో నాణ్యత ప్రమాణాలు కొరవడటమే కారణమని అన్నారు. ఈ కార్యక్రమానికి కామర్స్ అధ్యాపకులు ఏ. రవీందర్ అనుసంధానకర్తగా వ్యవహరించగా హరిత, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ శంకర్, నర్సింహాచారి,ఉపేందర్,ఉదయ్ కుమార్,మాధురి, కార్యాలయ సిబ్బంది వెంకన్న,వెంకట్ రెడ్డి,సుదర్శన్,కార్తీక్,సరోజ,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పాల్ లేనిలోటు సంఘానికి తీరనిది

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** క్రీస్తు ప్రభు సంఘం చర్చి దైవజనులు సీనియర్ పాస్టర్ రెవ. డా. దామెర్ల పౌల్ (నాగయ్య) ప్రభు నందు నిద్రించడం సంఘానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటని రాష్ట్ర క్రైస్తవ నాయకులు, సూర్యాపేట పాస్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీతారాంపురంలో పౌల్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవ. డా. పి. జాన్‌మార్క్, డబ్ల్యుయంఇ సూర్యాపేట రెవ. బొక్క ఏలియారాజు, నియోజక వర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, పట్టణ అధ్యక్షులు రెవ. ఇంజమూరి గాబ్రియేల్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చిల్లేపల్లి వాసి వశీకర్ ఎంపిక



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** 70వ ఎస్‌జిఎఫ్ఐ అండర్14 బాలుర రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కొడిద వశీకర్ ఎంపికయ్యాడు. భువనగిరిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో సూర్యాపేట జిల్లా తరుపున పాల్గొన్న వశీకర్ తన అద్భుతమైన ఆటతీరుతో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. చిల్లేపల్లి గ్రామ సర్పంచ్ కొడిగ అపర్ణ మనోజ్ కుమారుడైన వశీకర్ ఈనెల 13, 14, 15 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఏకశీల న్యూవిజన్ పాఠశాల ప్రిన్సిపాల్ భరత్‌రెడ్డి వశీకర్‌ను ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని ఎంపిక చేసినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## కిట్స్‌లో ప్రాంగణ ఎంపికలు



**ప్రజాపక్షం/కోదాడ:** కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపిక నియామకాల్లో 44 మంది బిటెక్ విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్లపల్లి గాంధీ తెలిపారు. హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ ఉత్పత్తి రంగ సంస్థ ఎంఆర్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. సంస్థ మానవ వనరుల అధికారి విజయ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో కళాశాలకు చెందిన 44 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను సంవత్సరానికి 3,50,000 వేతనం అందించనున్నట్లు సంస్థ మానవ వనరుల అధికారి విజయ్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నీలా సత్య నారాయణ ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిపివో పుష్పలత, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## అంబులెన్స్ సేవలు ఉపకరిస్తాయి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అత్యవసర వైద్య పరిస్థితుల్లో రోగులను సకాలంలో మెరుగైన వైద్యం అందించే ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సేవలు ఎంతగానో ఉపకరిస్తాయని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫిఉల్లా అన్నారు. అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గండూరి ప్రవళిక ప్రకాష్ సౌజన్యంతో సూర్యాపేట జిల్లా ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను సూర్యాపేట జనరల్ ఆసుపత్రి నందు వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ శ్రవణ్ కుమార్, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, కౌన్సిలర్ గండూరి రమేష్, ఇంచార్జి డాక్టర్ ఉపేందర్, ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాసు, ఎలగందుల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ సర్పంచ్ పురస్కారానికి ఎంపిక



**ప్రజాపక్షం/మర్రిగూడ** : మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామపంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు,మౌలిక వసతులు, తాగునీరు,విద్య,ఆరోగ్యం,రైతుల సంక్షేమం, మహిళా సంక్షేమం వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ కృషి చేస్తున్నందున సర్పంచ్ వల్లముల సంతోష్ యాదవ్ జాతీయ ఉత్తమ సర్పంచ్ పురస్కారానికి ఎంపికయ్యారు.ఈ నెల 15న ఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ వారు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు.ఈ పురస్కారం రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, ఇది గ్రామ ప్రజల అభిమానమేనని గురువారం ప్రజాపక్షంతో మాట్లాడుతూ తెలిపారు.

## రేషన్ డీలర్లకు గౌరవ వేతనం చెల్లించాలి



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోదాడ పట్టణానికి చెందిన రేషన్ డీలర్లు తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం చెల్లించాలని, అదే విధంగా ఒక్క క్వింటా రేషన్ బియ్యం పంపిణీపై రూ.300 కమిషన్ అందించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యావసర సరుకుల పంపిణీలో కీలకపాత్ర పోషిస్తున్న రేషన్ డీలర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా తగిన ఆదాయం లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ప్రభుత్వ రేషన్ సరుకులను సక్రమంగా అందించడంలో రేషన్ డీలర్లు నిరంతరం సేవలందిస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కె ఫయాజ్, రాష్ట్ర కార్యదర్శి నూనె యోగనందరావు, కోదాడ పట్టణ అధ్యక్షులు రాజేందర్, పట్టణ కార్యదర్శి హరికిరణ్‌తో పాటు రేషన్‌డీలర్లు రామ్మూర్తి, యాదా సుధాకర్, ఎన్. అశోక్, మస్తాన్, యాకుబ్, నాగభూషణం పాల్గొన్నారు.



## 45 రోజుల పాటు అన్నప్రసాదం

**ప్రజాపక్షం/నకిరేకల్** :అయ్యప్ప మాలధారులకు 45 రోజుల పాటు నిరంతరాయంగా భిక్ష (అన్నప్రసాదం) అందించే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శ్రీకారం చుట్టారు.స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారుల కోరిక మేరకు తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి 45 రోజుల పాటు ప్రతిరోజూ మధ్యాహ్నం స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అయ్యప్ప స్వాములతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.దీక్షా కాలంలో స్వాములకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని పలు వార్డులకు చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. 10వ వార్డుకు చెందిన అనారోగ్య బాధితుడు చంద్రయ్యను,16వ వార్డుకు చెందిన ఫక్రుద్దీన్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 9వ వార్డుకు చెందిన యానాల శంకర్‌రెడ్డి కుమారుడు ఉపేందర్‌రెడ్డి మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు లింగాల వెంకన్న,పన్నాల రాఘవరెడ్డి,చౌగోని శ్రీనివాస్,పన్నాల శ్రీనివాస్ రెడ్డి,ఘర్షకోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణపై దృష్టిపెట్టాలి



**ప్రజాపక్షం/మునగాల:** నీటి సంరక్షణపై దృష్టి పెట్టాలని డిఆర్‌డిఓ ఆర్, సన్యాసయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ రోడ్డు పార్మేషన్ పనులను ఆయన సందర్శించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ కూలీలు ప్రతి సమానంగా పనిచేసి 308 వేతనం పొందాలని, కూలీలకు 125 రోజుల పనిదినాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు లేవని, ప్రతి ఒక్కరు నీటిని సంరక్షించుకోవాలని, ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు తీసుకోవాలని, పామ్ ఫండ్స్ నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న జల సిరి పనులలో భాగంగా రెయిన్‌వాటర్ హార్వెసింగ్ పక్చర్ కమ్యూనిటి సోక్ ఫిట్ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా గురవయ్య, ఎంపిడిఓ నరేష్, ఎపిఓ శైలజ, ఈసి కళ్యాణ్, ఎపిఎం కరుణాకర్; టిఏ నూకల శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పవన్, ఐకెపి సిసి , ఫీల్డ్ అసిస్టెంట్ సులోచన పాల్గొన్నారు.

## నవజాత శిశువుల పట్ల జాగ్రత్తలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం చలి కాలం ప్రారంభమైన నేపథ్యంలో నవజాత శిశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణులకు ప్రసవాల సంఖ్యను పెంచే విధంగా ఏఎన్ ఎంలు, ఆశాలు కృషి చేయాలని మండల వైద్యాధికారి డా. హైమావతి గురువారం ఏఎన్ఎం, ఆశాలకు నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు చలికాలంలో నవజాత శిశువులకు ఎక్కువగా న్యూమోనియా ప్రమాదం ఉన్న నేపథ్యంలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వారిని దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి చికిత్స అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో వెంకటేశం, పిహెచ్ఎన్ వనజకుమారి, హెచ్ఎస్ కరుణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## లక్ష మందితో బహిరంగ సభ

**ప్రజాపక్షం/నకిరేకల్:** ఏఐకేఎస్36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 15న నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో లక్ష మందితో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల పిలుపునిచ్చారు. గురువారం నకిరేకల్ పట్టణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.16 నుంచి 18 వరకు ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వంటపాక వెంకటేశ్వర్లు,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సాకుంట్ల నర్సింహ,కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటపాక కృష్ణ,రైతు సంఘం మండల అధ్యక్షురాలు గింజల లక్ష్మి,మర్రి వెంకటయ్య సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎఫ్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసుకుందాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎస్సి వర్గీకరణను సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించుకున్న తర్వాత కుల,మత,వర్గ,లింగ వివక్షత లేని, సామాజిక,ఆర్థిక,రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని,సమాజహితం,సామాజిక న్యాయం, సమానత్వం కోసం భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధమవుతున్నామని ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి కోళ్ల శివ మాదిగ అన్నారు.జిల్లా కేంద్రంలోని పీఆర్‌టియూ భవన్‌లో ఎంఆర్‌పీఎస్,ఎంఎస్పీ,ఎంఎస్ఎఫ్ జిల్లా సమీక్ష సమావేశం ఎంఆర్‌పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో శివ మాదిగ మాట్లాడుతూ నవంబర్ 20 లోపు క్షేత్రస్థాయిలో విద్యార్థులతో సమావేశాలు జరిపి నూతన ఎంఎస్ఎఫ్ కమిటీలు ఏర్పాటు చేసి వారిని భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త జానకిరామ్ చౌదరి,ఎంజేఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్ మాదిగ,ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ,ఎంఎస్ఎఫ్ జిల్లా ఇంచార్జి నూకపంగా మోహన్ మాదిగ, ఎంఎస్పీ నాయకులు మచ్చ ఏడుకొండలు, మేడి శంకర్,మడుపు శ్రీనివాస్,మార్పాక గోపాల్, ఎర్రసాని గోపాల్,ఏర్పుల వెంకటయ్య, చింత శివ శంకర్ పాల్గొన్నారు.

## చండూరులో పోలీస్‌తో విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/చండూరు** : మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలు వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు గురువారం చండూరు మున్సిపాలిటీలో పోలీస్ డాగ్స్ తో విస్తృత తనిఖీలు చేపట్టారు.యువత మాదక ద్రావ్యాల బారిన పడకుండ కాపాడటం పోలీసుల బాధ్యత అన్నారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పలు పాన్ షాపులు,రెస్టారెంట్లో,బస్టాండ్,హోటల్స్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారుయువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని,గంజాయి వంటి నిషేధిత పదార్థాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో అక్రమ మాదక ద్రావ్యాల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం నిర్వహించబడతాయని పోలీసులు తెలిపారు.హెడ్ కానిస్టేబుల్ ఆదిమూలం శ్రీనివాస్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన మైనార్టీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అర్హులైన మైనార్టీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి విశాల్ ధార గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నారని పేర్కొన్నారు. టిజిబిఆర్‌బి పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ, టిజిపిఎస్‌సి గ్రూప్ 1, 2, 3, 4 పోటీ పరీక్ష లకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధృవపత్రాలతో ఈనెల 14లోపు దరఖాస్తులను మైనార్టీ సంక్షేమ శాఖ, సూర్యాపేట కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మైనార్టీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని కోరారు.

## ఆర్థిక పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి




**ప్రజాపక్షం/నకిరేకల్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు, బ్యాంకింగ్ సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్ సూచించారు.ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏసీబీ నకిరేకల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నకిరేకల్‌లో ఆర్థిక సమ్మిళిత ప్రత్యేక శిబిరం నిర్వహించారు.2026 అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన,ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన,అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో ఆర్‌బీఐ హైదరాబాద్ జనరల్ మేనేజర్ ఎం.జి.నుప్రభాత్,నల్లగొండ డీజీఎం ప్రియబ్రత మిశ్రా పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఐడియల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** గ్రామీణ క్రీడా ప్రతిభను చాటుతో ఐడియల్ స్కూల్ విద్యార్థి లక్ష్మి ప్రసాద్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వికారాబాద్ వేదికగా ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న 36వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆయన జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శెట్టి రామచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్‌వి రమణకుమార్ లక్ష్మి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు కీర్తిని తీసుకరావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జి రాజశేఖర్, పిఈటి బసవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎండి పోయిన వరి పత్తి పంటలను పరిశీలన

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలం లోని గురువారం కేతేపల్లి, గానుగుపల్లి, కుందేలు తిరుమలగిరి, మహ్మాదాపురం, గట్లమల్లెపల్లి, గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయికుమార్, పావని ,ఎండి పోయినటు వంటి పత్తి పంటలను సందర్శించి పంట నష్టం కింద ఫోటోలు అప్లోడ్ చేశారు.ఎవరైనా రైతులు పంట నష్టం కలిగి ఉంటే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేసి నమోదు చేయించుకోగలరు అని,ఎల్ నినో ప్రభావం వలన యాసంగి లో వరి పంట కు బదులుగా ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో కేతేపల్లి గ్రామ సర్పంచ్ పెరికేటి రమేష్ రైతులు కోటయ్య,ఈదయ్య,వెంకటేశ్వర్లు,రామకృష్ణ, కడారి రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వాలే సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి

**ప్రజాపక్షం/నాంపల్లి :**ఎల్నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురవక భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నేరెళ్ల సైదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు తాగునీరు,పశుగ్రాసం అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.వీబీజీ రామ్ జీ పథకం ద్వారా ఐదు ఎకరాల్లోపు భూమి కలిగి,బోరుబావులు ఉన్న సన్న,చిన్నకారు రైతులకు పశుగ్రాసం అందించే కార్యక్రమాన్ని అమలు చేయాలని తెలిపారు.

## స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరువీధి ఉత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి:** స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదారవిందములకు ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో, శ్రీ స్వామి వారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవను అర్చకస్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. అనంతరం ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

## ధాన్యం చేపట్టకపోతే ఆందోళన తీవ్రతరం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని బిఆర్ఎస్ పార్టీ హెచ్చరించింది.మండల గులాబి పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడి ఆధ్వర్యంలో గురువారం వరి ధాన్యం కొనుగోళ్ళు ఆలస్యం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పట్టణంలో రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు.సిఎం,ఎమ్మేల్యే దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు.ప్రభుత్వానికి అదికారుల తీరుపై వ్యతిరేక నినాదాలు చేశారు.నిరసన విరమించకపోవటంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది.దీంతో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి ఉన్న తాధికారులతో మాట్లాడి ఒకటి రెండు రోజుల్లో తప్పకుండా కాంటా వేస్తామని చెప్పటంతో ధర్నా విరమించారు.రైతుల పక్షాన ధాన్యాన్ని తరలించాలని కోరుతూ వినతి పత్రాన్ని ఎమ్మార్వోకు అందజేశారు.



## గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు,విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు,విద్యుత్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ నాయక్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన తిరుమలగిరి సాగర్ మండలం, డొక్కలబాయి తండా,రంగుండ్ల బండ్ల గ్రామంలో షెడ్యూల్డ్ తెగల ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో గ్రామస్థులు తమ సమస్యలను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని,మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాలని,గిరిజన విద్యార్థుల కోసం 5 వేల మంది విద్యార్థులకు వసతి కల్పించేలా గిరిజన హాస్టల్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. అలాగే గ్రామానికి 11 కేవీ విద్యుత్ లైన్



ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన కమిషన్ సభ్యులు సంబంధిత డీఈని వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,డీఎంహెచ్ఓ రాహుల్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించడమే అగ్రిషో లక్ష్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు,శాస్త్రీయ పరిజ్ఞానం,నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడమే లక్ష్యంగా మూడు రోజుల పాటు అగ్రిషో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే,రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి తెలిపారు. ఈ నెల 14,15,16 తేదీల్లో నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించే అగ్రిషోను రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల వారు,పట్టణ ప్రజలు సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గురువారం నల్లగొండలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి,తుమ్మల వీరారెడ్డి,బండ శ్రీశైలం, ఎండీ హషం, పాలడుగు నాగార్జునతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నల్లగొండలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరిగే అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్)36వ జాతీయ మహాసభలు,41వ జీఎం కన్వెన్షన్లలో భాగంగా అగ్రిషో ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అగ్రిషోను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాము నాయక్,ఎండి సలీం వెంకట్ రెడ్డి,పుచ్చకాయ నర్సిరెడ్డి,నలపరాజు సైదులు,కొండ వెంకన్న,పి.సత్యనారాయణ,కొండ వెంకన్న,వి నారాయణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## నేటి దూడలే... రేపటి పాడి పశువులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రైతులందరూ తమ పశువులకు లింగ నిర్ధారిత వీర్యాన్ని (సెక్స్ సార్టెడ్ సీమెన్) వినియోగించి కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా అధిక సంఖ్యలో ఆడదూడలను పొందాలని తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ బి.సుబ్బారాయుడు సూచించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా ఆధ్వర్యంలో పానగల్లు గ్రామంలో మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుబ్బారాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి ఆడదూడలే రేపటి పాడి పశువులు కాబట్టి వాటి సంరక్షణకు రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.వి.రమేష్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు తమ పశువులకు అవసరమైన పచ్చి మరియు ఎండు పశుగ్రాసాన్ని విరివిగా సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక అధికారి కార్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు,గోపాల మిత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఎల్‌నినో పరిస్థితులలో తీసుకోవాల్సిన చర్యల గురించి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగరాజు,సహాయ సంచాలకులు,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు,గోపాల మిత్రులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** జిల్లా వ్యాప్తంగా సొసైటీ, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు వెంటనే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి నవంబర్ 15 నుండి 18 వరకు విప్లవాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న అఖిల భారత రైతు సంఘం జాతీయ 36వ మహాసభలను, 15 వ తేదీన నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తుర్కపల్లి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కేంద్రాన్ని సందర్శించి చేసి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, మండల కమిటీ సభ్యులు తలారి మాతయ్య, రైతులు బోయిని హరి, సత్తయ్య, కలమ్మ, పోచమ్మ అండాలు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి మండల టిజియుఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/డిండి;** విద్య అనేది సమాజ మార్పుకు మూల స్తంభమైతే, ఆ విజ్ఞాన దివిటీని వెలిగించే ఉపాధ్యాయుడే ప్రగతికి నిజమైన మార్గదర్శి ఈ దివ్యమైన ఆశయంతో గుండ్లపల్లి మండలంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీయూఎస్) మండల మహాసభ గురువారం అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. గిరిజన సముదాయాల ఉన్నతి కోసం విద్యా వేత్తలందరూ ఏకమైన ఈ చైతన్య వేదికలో మండలంలోని ఉపాధ్యాయుల పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమిష్టి ఉనికిని చాటారు. ఈ మహాసభ సందర్భంగా గుండ్లపల్లి మండల టీజీయూఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటి రాబోయే రెండు సంవత్సరాల కాలపరిమితి పాటు సేవలందిస్తారు. గౌరవఅధ్యక్షులుగా కరంబోతు శ్రీనునాయక్, అధ్యక్షులుగా కాట్రావత్ నవీన్, అసోసియేషన్ అధ్యక్షులుగా కొండ్రెడ్డి యాదయ్య, మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలుగా కేతావత్ దివ్యశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ రవినాయక్, కార్యదర్శిగా కొర్ర రమేష్, మహిళా కార్యదర్శిగా రమావత్ వాసవి, కోశాధికారిగా వడ్త్య రామునాయక్‌లు ఎన్నికయ్యారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభం

**ప్రజాపక్షం/రామన్నపేట:** కోరమండల్ కంపెనీ వారి సహకారంతో ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ బుధవారం తెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ కార్యదర్శి ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి, రమణారెడ్డి, ఏడీఏ భిక్షపతి, మండల వ్యవసాయ అధికారి ఏజే ఖాన్, కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, హెచ్ ఆర్ సుధాకర్, హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రితం స్వామి, ఆగ్రోనామిస్ట్ రామకృష్ణ పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు పెన్షన్ కల్పించేందుకు కృషి

**ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి:** యాదాద్రిభువనగిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత బుధవారం చీమల కొండూరులోని బెజ్జు లక్ష్మయ్య ఫౌండేషన్ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వయోవృద్ధుల యొక్క బాగోగులను, ఆశ్రమ నిర్వాహకులు కలిపిస్తున్న వసతులపై అడిగి తెలుస్తున్నారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ వయోవృద్ధులు ఒంటరి వారి కారని వారి సంరక్షణకై చట్టం అన్ని హక్కులను కల్పించిందని వాటిని సాధించుకోవటానికి అవకాశాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకునేటట్లుగా న్యాయ సేవా సంస్థ న్యాయ సేవలను అందజేస్తుందని తెలిపారు. ఆశ్రమంలో ఉంటున్న కొంతమంది వయోవృద్ధులకు పెన్షన్ ఇతర ప్రభుత్వ లబ్ధి రావట్లేదని తెలుసుకొని దానికై తగు న్యాయ సేవలు అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్, వయోవృద్ధులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా స్పీడ్ హాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/రామన్నపేట:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో స్పీడ్ హ్యాండ్ బాల్ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ స్పీడ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ నిర్ణయం మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లా నూతన బాధ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా మంద వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏలుగు చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మంద వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించిన తెలంగాణ స్పీడ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టును అగ్రస్థానంలో నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. నూతన బాధ్యులుగా నియమితులైన మంద వేణుగోపాల్ రెడ్డి, ఏలుగు చంద్రశేఖర్‌లకు జిల్లా క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ ఆదాయ, వ్యయాల వివరాలు వెల్లడించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మున్సిపాలిటిలోని కొత్త పాల కవర్గం ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ కాలంలో మున్సిపాలిటికి వచ్చిన జనరల్ ఫండ్, క్యాపిటల్ పండ్, ఆదాయాల, ఖర్చుల పూర్తి వివరాలను వెల్లడించా లని బిఆర్ఎస్ కౌన్సిలర్లు నల్లగొండ సుజాత, చిట్టిపోతుల భద్రమ్మలు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమి షనర్ వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు, ఎంత వచ్చాయని, ఎంత ఖర్చు చేశారని, ఏయే అభివృద్ధి పనులకు కేటాయించారని ప్రశ్నించారు. ప్రజా ధనం వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రతి రూపాయి ఖర్చుకు లెక్కలు ప్రజా ప్రతిని ధులకు తెలియజేయాలని కోరారు.

## గ్రామపంచాయతీ భవనానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/నంస్థాన్ నారాయణపురం:** మండలంలోని రాధానగర్ తండా గ్రామపంచాయతీ భవనానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ లక్ష్మీ శ్రీరామ్ కలెక్టర్ అనురాగ జయంతికి గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రజల అవసరాల కోసం గ్రామపంచాయతీ నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కలెక్టర్ అనురాగ్ జయంతి మండల అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ భవనానికి స్థలం కెటాయించేందుకు ఆదేశించిన కలెక్టర్‌ను రాధానగర్ తండా సర్పంచ్ లక్ష్మీ శ్రీరామ్ శాలువాతో సన్మానించారు.

## బిజెపి రూరల్ ఒబిసి అధ్యక్షుడిగా లింగం యాదవ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండల రూరల్ బిజేపి పార్టీ ఓబిసి అధ్యక్షునిగా మాకోలు లింగం యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం పార్టీ మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నకల్లో జిల్లా మాజి అధ్యక్షుడు పాశం బాస్క ర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడు తూ తన పట్ల నమ్మకంతో కీలక బాధ్యతను అప్పజెప్పినం దుకు ధన్యవాదాలు తెలుపుతూ ఎల్లవేళల అందరికి అం దుబా టులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఫోటో రైట్ అప్: నూతనంగా ఎన్నికైన లింగం యాదవ్

## ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** :ఉపాధిహామి పనుల పురోగతిపై సమీక్ష చేసి నిర్దేశించిన పనులను వేగ వంతంగా పూర్తి చేయాలనీ జిల్లా పరిషత్ సిఈవో ఎన్ శోభారాణి అధికారులను ఆదేశించారు.గురువారం ఆమే పంచాయితి కార్యదర్శులతో సమావేశమై విబిజిరామ్‌జి పథకం కిందా అర్హులైన కూలీలకు పని కల్పించాలని సూచించారు.అనంతరం ఆమే జలాల్ పురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఆరోగ్య కేంద్రం కోసం స్థల పరిశీలన చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## రాజ్యాధికారమే లక్ష్యంగా బిసిల చరిత్రను వెలికితీస్తాం

### బిసిలకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తున్నాం: తీన్మార్ మల్లన్న

**ప్రజాపక్షం/మోటకొండూర్:** బీసీ, బహుజన వర్గాల చారిత్రక మూలాలను వెలికితీయడంతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లో ఆయా వర్గా లకు దక్కాల్సిన హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే బీసీ రాజ్యాధికార యాత్ర లక్ష్యమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపేర్కొన్నారు. ఆయన పాదయాత్రలో బాగంగా 49 వరోజు బుదవారం ఆలేరులో ప్రారంభమైన యాత్ర మోటకొండూర్ మండలంలోని దిలావర్ పూర్, మోటకొండూర్, సికిందర్ నగర్, కాటెపల్లి, ముత్తిరెడ్డిగూడెంలలో పాదయాత్ర నిర్వహించి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా రాజ కీయ అధికారంలో ఆధిపత్యం చెలాయిస్తున్న వర్గాల కారణంగా బీసీలకు తగిన ప్రాతినిధ్యం దక్క లేదని అన్నారు.. ఈ పరిస్థితులపై ప్రజలను చైతన్య పరిచేందుకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. 49వ రోజు పాదయాత్రలో భాగంగా ఆలేరు నుంచి ముత్తిరెడ్డిగూడెం వరకు సాగిన యాత్రకు పలు గ్రామాల్లో ఘనంగా స్వాగతం లభించింది. దిలావ పూర్ గ్రామ ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు సభ్యుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామస్థులతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు మల్లన్నను కలిసి పాదయా త్రకు మద్దతు ప్రకటించారు.

**తీన్మార్ మల్లన్న పాదయాత్రలో అపశృతి** : తీన్మార్ మల్లన్న పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో మల్లన్న క్లాస్ మేట్ చాడ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ తీన్మార్ మల్లన్న కలవడానికి ప్రయత్నించగా మల్లన్న వ్యక్తిగత సిబ్బంది సర్పంచిని గుర్తించక తీన్మార్ మల్లన్నపై దాడి చేయడానికి వచ్చారేమో అని అపోహతో సర్పంచ్ పై దాడి చేసి గాయపరి చారు. అనంతరం విషయం తెలిసిన మల్లన్న చాడ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌ను స్టేజీ పైకి శ్రీనివాస్ తన క్లాస్‌మేట్ అని అతనిపై దాడి జరిగితే నాపై దాడి జరిగినట్లేనని బాధాకరమని చింతిస్తున్నామని తెలి పారు. టిఆర్‌పి కార్యకర్తలు సర్పంచ్ శ్రీనివాస్‌ను కలిసి క్షమాపణలు కోరారు.

## స్వర్ణగిరిలో కార్తీక మాసం సత్యనారాయణ స్వామి వ్రతం



**ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి:** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవ, మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవ, సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పా వడ సేవలో బాగంగా అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం సమ ర్పించారు. అదేవిదంగా కార్తీకమాసం పురస్కరిం చుకుని వైభవ మంటపంలో శ్రీసత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. స్వామివారి నిత్యక ళ్యాణోత్సవం అనంతరం సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చా రణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగ ళహారతులు సమర్పించారు. భక్తులు నయనానంద కరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

## దళిత యువకుడిపై దాడి ఘటనపై డిఎస్పికి ఫిర్యాదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్ట ణానికి చెందిన ఆర్య వైశ్యులు శరాబు జగదీష్, ఆయన వర్కర్లు దైద సత్యం ఇంటిపై దాడి చేసి ఆయన కుమారుడి తలపై కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచారని దళిత ఐక్య సంఘాల వేదిక నాయ కులు ఆరోపించారు. ఈ ఘటనపై గురువారం వారు మిర్యాలగూడ డిఎస్పీ జి.రవికి ఫిర్యాదు చేశారు.దీపావళి రోజున భారీ బాంబులు కాల్చవ ద్దని వారించినందుకు కోపంతో ఈ దాడికి పాల్పడ్డా రని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో జగదీష్ కుమారుడితో పాటు భార్య, మిత్రులు, వర్కర్లు గాయపడ్డారని తెలిపారు. నిందితులపై తక్షణమే తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిప క్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన లను తీవ్రం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో దళిత నేతలు డాక్టర్ జె. రాజు, మాల మహా నాడు నాయకులు తాళ్లపల్లి రవి, బిఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, కెవిపిఎస్ నాయ కులు రేమిడాల పరశురాములు, ఎమ్మార్పిఎస్ నాయకులు మచ్చ ఏడుకొండలు, మాద్గుల శ్రీని వాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు వివాదంలో ఉన్న స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక కోర్టులో వివాదం నడుస్తుండగా తన ఇంటి స్థలాన్ని ఆక్ర మించి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు బద్రి రేణుక కోరారు. గురువారం మిర్యాలగూడ ఎన్ ఎస్పీ క్యాంపు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె వివ రాలు వెల్లడించారు.మిర్యాలగూడ మునిసిపల్ పరి ధిలోని సర్వే నంబర్ 827లో ప్లాట్ నంబర్ 5లోని 473 చదరపు గజాల ఇంటి స్థలాన్ని దైద కాశయ్య వద్ద కొనుగోలు చేసి, 1998 ఫిబ్రవరి 6న సబ్ రిజి స్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నా నని, అప్పటి నుండి ఆ భూమి తన ఆధీనంలోనే ఉందని తెలిపారు. అయితే 2018లో దైద నాగ రాజు మరో 13 మంది మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నంబర్ 72/2018 దావా వేసి 827 సర్వే నంబర్ లోని 18 గుంటల భూమికి యాజమాన్య హక్కులు కల్పించాలని కోరగా, ఆ కేసు ప్రస్తుతం విచారణలో పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు.వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే దైద నరహరి సర్వే నంబర్ లోని 479 చదరపు గజాల భూమిని ఆక్రమించి అక్రమ నిర్మా ణాలకు యత్నిస్తున్నాడని ఆరోపించారు.

## భరత్ ఎలా ఉన్నావు...

### దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఐఎఎస్

**ప్రజాపక్షం/నంస్థాన్ నారాయణపురం:** మండలంలోని సేరి గూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్ర చారిని గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా పనిచేసిన హనుమంతరావు దత్తత తీసు కున్నారు. ప్రస్తుతం దేవాదాయ ధర్మాదాయ కమిషనర్‌గా బదిలీ అయిన కూడా బుధవారం భరత్ చంద్ర చారిని కలిసి భరత్ ఎలా ఉన్నావు అని ఆప్యాయంగా పలకరించారు అదేవిదంగా కుటుంబ బాగోగులు అడిగి తెలుసుకుని మంచిగా చదువుకోవాలని సూచిం చారు. భరత్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు వేగ వంతం చేయాలని స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశిం చారు. భరత్ కుటుంబానికి మూడు నెలలకు సరిపడా బియ్యం నిత్యవసర వస్తువులు, ఇరవై వేయిల రూపాయలు అందజేశారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న నాకు తెలియజేయాలని భరత్ కుటుం బానికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక ఎస్సై ఎస్ పాండు, స్థానిక సర్పంచ్ వీరేశం, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

## బీర్ల అయిలయ్య జోలికి వస్తే ఊరుకునేది లేదు



**ప్రజాపక్షం/మోటకొండూర్:** బీసీ ముసుగు వేసుకున్న తోడేలు తీన్మార్ మల్లన్న అని, బీసీల ముసుగులో బీసీలను అణదోక్కేందుకే ప్రయత్నిస్తున్నాడని అందుకు నిదర్శనమే చాడ సర్పంచ్ బీసీ బిడ్డ ఆకుల శ్రీనివాస్ పై దాడి అని, ఆకుల శ్రీనివాస్ కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్‌ల పోరం ఉపాధ్యక్షులు జెన్నే సిద్దులు డిమాండ్ చేశారు. గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ రాజకీయం అంటే టీవీ ముందు కూర్చుని వార్తలు చదివినంత సులువు కాదని, బీసీ బిడ్డ అయి ఉండి బీసీల పైన పోటీకి సిద్ధమవడం కాదు, దమ్ముంటే ఆలేరులో బీసీ బిడ్డ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏ నియోజకవర్గం నుండి అయినా పోటీ చేసి గెలువాలని సవాల్ విసిరారు. బీర్ల అయిలయ్య జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి సింగిల్ విండో చైర్మన్ సుబ్రహ్మణ్యం, మండలం లోని వివిధ గ్రామాల సర్పంచులు ఆకుల శ్రీనివాస్, భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్, బుడిగ నాగరాజు, గట్టి గొప్పల సరిత మచ్చేందర్, బొట్ల నగేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుగ్గ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా కామ్రేడ్ రెబ్బాస్ రాములు ఎన్నిక

**ప్రజాపక్షం/రామన్నపేట:** యాదాద్రిభువనగిరి జిల్లా ఉద్యమకా రుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా కామ్రేడ్ రెబ్బాస్ రాములుని ఉద్య మకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ బుధ వారం నియామక పత్రం అందజేసినారు. అనంతరం కామ్రేడ్ రెబ్బాస్ రాములు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపా ధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు డాక్టర్ చీమ శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలిపినారు. తన ఎన్నికకు సహకరించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్.కె చాంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్నలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్ర మంలో రామన్నపేట మండల అధ్యక్షులు సోముల శంకర్, ఉపాధ్య క్షులు బొడ్డుపల్లి లింగయ్య, మైనార్టీసీల అధ్యక్షులు ఎండి ఇమామ్ సాబ్, ఉద్యమ నాయకులు గొలుసుల ప్రసాద్, ఆవుల నరేందర్, మధ్య గల నరసింహ, కైరంకొండ సంతోష్, వంగాల యాదయ్య, గద్దం యాదగిరి, ఏలూరు రవి, డాక్టర్ కొండా మల్లేష్, డాక్టర్ నకిరే కంటి అశోక్, స్మెలాబ్ తదితరులు పాల్గొన్నారు.